
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు

5
ఆదివారం 14 సెప్టెంబరు 2025

..గుర్తుకు రావడం లేదు



• ఇలా నివారించుకుందాం

- రోజూ నిద్రకు 8 గంటలకు కేటాయించాలి.
- డిజిటల్ స్ర్కీన్ వినియోగం తగ్గించాలి.
- సుదీర్ఘంగా స్ర్కీన్‌పై ఉండాల్సి వచ్చినప్పుడు మధ్యమధ్యలో విరామం తీసుకోవాలి.
- జ్ఞాపకశక్తి, మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపేలా వ్యాయామాలు చేయాలి.
- వాకింగ్, జాగింగ్, ఎరోబిక్స్ వంటి వ్యాయామాలు మెదుడులోని హిప్పొ క్యాంపస్ భాగం వృద్ధికి తోడ్పడుతాయి.
- గ్రీన్ టీ, తాజా ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

బంధువుల పేర్లు.. వారి వరసులు గుర్తుకు రావడంలేదు. స్నేహితుల ఫోన్ నెంబర్లు, ఏ పేర్లతో సేవ్ చేసుకున్నారో వెంటనే తెలుసు కోలేకపోతున్నాం. దగ్గరి బంధువులు, సన్నిహితులతో పాటు కొన్ని సార్లు కుటుంబసభ్యుల పుట్టిన రోజు, పెళ్లి రోజులపైనా తడబాటు. చిన్నచిన్న నోటి లెక్కలను కూడా స్వయంగా చేయలేక తికమకపడుతున్నాం. ఒక్కోసారి సొంత ఫోన్ నంబరును కూడా తప్పుగానే చెబుతున్నాం. ఇదీ నేటి సెల్‌తరంలో చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సోకి న డిజిటల్ జబ్బు. ప్రస్తుతం ఇలాంటి సమస్యలు చాలామందిని వేధిస్తు న్నాయి. సెల్ ఫోన్‌ను ఓ పరికరంగా కాకుండా అదో వ్యసనంగా మారడం తోనే తలెత్తిన మానసిక సమస్యగా పలువురు చెప్తున్నారు. గుర్తుకురాక పోవడం.. మతిమరుపు.. తికమక.. గజిబిజి.. తదితర లక్షణాలన్నీ గతంలో వృద్ధులో ఉండేవి. అయితే ప్రస్తుతం ఆ లక్షణాలన్నీ కూడా సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారిన విద్యార్థుల నుంచి పెద్దల వరకు కనిపిస్తున్నాయి. ఈ లక్షణాలు తరుచుగా ఉంటే మాత్రం డిజిటల్ డిమెన్షియా అయి ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు.

పేర్లు, ఫోన్ నెంబర్లపైనా తడబాటు

- రోజురోజుకు పెరిగిపోతోన్న మతిమరుపు
- సెల్‌ఫోన్ల అతి వినియోగంతోనే ఈ ప్రమాదం
- విజ్ఞానం, సృజనాత్మకతను దెబ్బతీస్తోన్న స్కీన్లు
- విద్యార్థుల నుంచి యువతరం వరకూ సమస్య
- చాపకింద నీరులా విస్తరిస్తోన్న డిజిటల్ డిమెన్షియా సమస్య

2022లో గుర్తింపు

సాంకేతికను అతిగా వినియోగించుకునే వారిలో జ్ఞాపకశక్తిలో వచ్చే సమస్యలను డిజిటల్ డిమెన్షియాగా 2022లో వైద్యులు గుర్తించారు. దీన్ని డిమెన్షియాకు ప్రారంభంలో వచ్చే మైల్డ్ కాగ్నిటివ్ ఇంపైర్‌మెంట్‌గా కూడా పిలుస్తారు. ప్రస్తుతం దీనిపై పరిశోధనలు జరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ సమ యాన్ని స్ర్కీన్‌కు కేటాయించడంతో జ్ఞాపకశక్తిపై ప్రభావం పడుతుందంటున్నారు.

8లో..



సండే స్పెషల్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తోన్న తమిమ్ అన్సారియా

ప్రజా కేంద్రీకృతంగా పనిచేయాలి

ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండాలి ● కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్‌అన్సారియా ● జిల్లా అధికారుల సమీక్షలో నూతన కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం ప్రజా కేంద్రీకృతం(పీపుల్ సెంట్రిక్)గా ఉండాలని కలెక్టర్ ఏ తమీమ్‌అన్సారియా సూచించారు. నూతన కలెక్టర్‌గా తమీమ్‌అన్సారియా బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం భర్త సీనియర్ ఐఏఎస్ అధికారి జిలానితో కలిసి కలెక్టరేట్‌కు చేరుకున్న తమీమ్‌అన్సారియాకు జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఏవో పూర్ణచంద్రరావు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సీటీసీ ఫైలుపై సంతకం చేసి కొత్త కలెక్టర్‌గా ఆశీనులయ్యారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో కలెక్టర్ సమావేశమై ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న కలెక్టర్ల సదస్సుకు సంబంధించి నివేదికలను సేకరించారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమై టీమ్‌వర్క్‌తో పని చేయాలని ఆదేశించారు. అధికారులు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ప్రతీ అంశాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో ఖాజావలి, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రాధాన్యం

ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వాళ్లని ప్రత్యక్షంగా కలుసుకుని సమస్యలను పరిష్కరిస్తానని మీడియా సమావేశంలో కలెక్టర్ తెలిపారు. తాను ఎక్కువగా క్షేత్ర పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్య పథకాలను అర్హులైన పేదలకు అందేలా చూసి వారు సంతృప్తి చెందేలా కృషి చేస్తానన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జీవోల సహకారం తీసుకుని జిల్లాని అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలుపు తానన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తమిమ్ అన్సారియా

రైల్వే.. హెల్త్ ఆన్ వీల్స్

● పని ప్రదేశాల్లోనే ఉద్యోగులకు చికిత్స
● గుంటూరు - రేపల్లె, మంగళగిరి మార్గాల్లో ప్రారంభం

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు వారు పనిచేస్తోన్న ప్రదేశాల్లోనే వైద్య సేవలందించేందుకు హెల్త్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఆ శాఖ చేపట్టింది. శనివారం గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణసేన్ గుంటూరు - రేపల్లె, మంగళగిరి మార్గాల్లో ఈ మెడికల్ రైళ్లను గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్రారంభించారు. ఆయా రైళ్లు ఆయా మార్గాల్లోని అన్ని స్టేషన్లలో ఆగి ఉద్యోగులకు వైద్య సేవలందించాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ డివిజనల్ రైల్వే హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణులు, లలిత, శంకర్, ఓమెగా వంటి రిఫరల్ ఆస్పత్రుల వైద్య బృందం, పారామెడికల్ సిబ్బంది ఈ హెల్త్ ఆన్ వీల్స్‌లో రైళ్లలో ప్రయాణించి ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు, నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసు, ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, డీఎంవో డాక్టర్ వీ సింధూ, సీనియర్ డీవోఎం జే శ్రీనాథ్, సీనియర్ డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

గుంటూరు - దర్శి సెక్షన్‌లో తనిఖీ

డీఆర్ఎం సుదేష్ణసేన్ శనివారం ఉదయం గుంటూరు నుంచి దర్శి రైల్వేస్టేషన్ వరకు తనిఖీ నిర్వహించారు. ప్రత్యేక రైలు ద్వారా ట్రాక్ మొత్తాన్ని, వంతెనల పటిష్ఠతను పరిశీలించారు. గుండ్లకమ్మ, దర్శి రైల్వేస్టేషన్లలో దిగి అక్కడ జరుగుతున్న పనుల నాణ్యతని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాసు, సీనియర్ డీవోఎం జే శ్రీనాథ్, సీనియర్ డీఎస్‌టీఈ జీ రత్నాకర్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన హెల్త్ ఆన్ వీల్స్ రైలు

ఎస్పీలు బదిలీ

- గుంటూరు జిల్లా ఎస్పీగా వకుల్‌జిందాల్
- బాపట్లకు ఉమామహేశ్వర్, పల్నాడుకు కృష్ణారావు
- శ్రీ సత్యసాయి, చిత్తూరు జిల్లాలకు సతీష్‌కుమార్, తుషార్ డూడి



ఎస్పీ వకుల్‌జిందాల్



ఎస్పీ కృష్ణారావు



ఎస్పీ ఉమామహేశ్వర్

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ఎస్పీలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేసి ఇక్కడ విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్‌ను నియమించారు. బాపట్ల ఎస్పీ తుషార్‌డూడిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేయగా, ఆ స్థానంలో సీఐడీలో విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర్‌ని నియమించారు. పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావును బదిలీ చేసి ప్రస్తుతం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న డీ కృష్ణారావును నియమించారు. గుంటూరు, బాపట్ల ఎస్పీలకు పోస్టింగ్ ఇవ్వగా కంచి శ్రీనివాసరావుకు మాత్రం పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా సతీష్‌కుమార్, తుషార్‌డూడి, శ్రీనివాసరావు గత ఏడాది జూలైలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులకు ఎస్పీలుగా ఆయా జిల్లాల్లో నియమితులయ్యారు. కాగా గుంటూరు జిల్లా ఎస్పీగా నియమితులైన వకుల్ జిందాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

పంజాబ్‌వాసి.. గుంటూరుకు

గుంటూరు ఎస్పీగా నియమితులైన వకుల్‌జిందాల్ పంజాబ్ రాష్ట్రానికి చెందినవారు. పంజాబ్‌లోనే ఇంటర్ వరకు చదివారు. తదనంతరం ఐఐటీ ఢిల్లీలో బీటెక్ కంప్యూటర్స్ పూర్తి చేశారు. ఐపీఎస్ 2016 బ్యాచ్‌కు చెందిన జిందాల్ ఆంధ్రా కేడర్‌కు ఎంపికయ్యారు. ఏఎస్పీగా రంపచోడవరంలో, కృష్ణాజిల్లా ఎస్ఈబీలో ఆ తర్వాత ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది నాటి సీఎం జగన్ సెక్యూరిటీ విభాగంలో పని చేశారు. 2022లో బాపట్ల జిల్లాగా ఏర్పాటయ్యాక తొలి ఎస్పీగా జిందాల్ నియమితులయ్యారు. గత ఎన్నికల సమయంలో ఆయన బాపట్ల ఎస్పీగా పనిచేశారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయనను విజయనగరం ఎస్పీగా బదిలీ చేసింది.

పల్నాడు జిల్లాకు ఐదో ఎస్పీగా..

పల్నాడు జిల్లాకు ఐదో ఎస్పీగా బీ కృష్ణారావు నియమితులయ్యారు. 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కృష్ణారావు 2020లో విశాఖపట్నం రూరల్ ఎస్పీగా పనిచేశారు. ఆ సమయంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతకుముందు విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ ఓఎస్‌డీగా పని చేశారు. ఏసీబీలో కొంతకాలం ఎస్పీగా పని చేశారు. పులివెందుల ఏఎస్పీగా, అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేశారు. మంగళగిరి, నర్సీపట్నం బెటాలియన్లలో విధులు నిర్వహించారు. కాగా 17 నెలల వ్యవధిలో నలుగురు ఎస్పీలు జిల్లా నుంచి బదిలీ కావడం గమనార్హం.

గ్రూప్-1 నుంచి ఎస్పీగా ఉమామహేశ్వర్

బాపట్ల జిల్లా ఎస్పీగా నియమితులైన ఉమామహేశ్వర్ గ్రూప్ వన్‌కు ఎంపికై డీఎస్పీగా పోలీస్ శాఖలో చేరారు. 2024లో ఆయన ఐపీఎస్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అంతకు ముందు ఆయన గురజాల, కడప డివిజన్లలో డీఎస్పీగా, అదిలాబాద్, వరంగల్ అర్బన్‌లో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించారు. ఇంటిలిజెన్స్, విజిలెన్స్‌తో పాటు సీఐడీ విభాగంలో ఎస్పీగా పనిచేశారు. ఉమామహేశ్వర్ ఆదివారమే బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం. గతేడాది జూలై 17న బాపట్ల జిల్లా ఎస్పీగా తుషార్‌డూడీ బాధ్యతలు తీసుకోగా దాదాపు 14 నెలల పాటు ఇక్కడ సేవలందించారు. సైబర్ నేరాల ఛేదనలో ప్రత్యేక మార్కు కనబరిచారు.



మంత్రి నారాయణతో పెమ్మసాని, ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు

గుంటూరు అభివృద్ధికి ప్రతిపాదనలు

- అమృత్ పథకంపై కేంద్రమంత్రి పెమ్మసాని సమీక్ష
- మంత్రి నారాయణ సహా ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు హాజరు


గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో శనివారం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, రామాంజనేయులతో పెమ్మసాని తన కార్యాలయంలో నగర అభివృద్ధిపై సమీక్షించారు. రూ.48 కోట్లతో ప్రారంభం కానున్న ఇన్నర్‌రింగ్ రోడ్డు పనులను తాత్కాలికంగా ఆపి, మరో రూ.70 కోట్లతో స్ర్టామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం కోసం ప్రతిపా దనలు సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు పెమ్మసాని తెలిపారు. మొత్తం రూ.128 కోట్లతో ఇన్నర్‌రింగ్‌రోడ్డుతో పాటు స్ర్టామ్ వాటర్ డ్రెయిన్ చేపడతామన్నారు. ఇందుకు మంత్రి నారాయణ కూడా సుముఖత వ్యక్తంచేశారు. అమృత్ ద్వారా చేపడుతున్న గోరంట్ల వాటర్‌ట్యాంక్ పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ శ్రీనివాసులు, సీఆర్‌డీఏ, పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ చీఫ్‌లు కృష్ణారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.



దాసరి రాణి



సారమ్మ



తన్నీరు నాగేంద్రం



దేవరపల్లి సామ్రాజ్యం

పిడుగుల వాన

● పిడుగుపాటుకు ఐదుగురు మృతి ● గుంటూరులో అకస్మాత్తుగా కుంభవృష్టి ● చెరువులను తలపించిన ప్రధాన రహదారులు రాకపోకలకు అంతరాయం.. స్తంభించిన జనజీవనం ● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం.. సాయం కోసం 0863 2234014



వెంకటేశ్వర్లు

గుంటూరు, గుంటూరు కార్పొరేషన్, పెదకాకాని, పెదనందిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై చీకట్లు కమ్ముకువచ్చాయి. అంతలోనే ఉరుములు, మెరుపులతో పెద్ద పెట్టున పిడుగులు విరుచుకుపడ్డాయి. కుంభవృష్టితో గుంటూరు, తెనాలి తదితర ప్రాంతాల్లో ప్రజలు వణికిపోయారు. పిడుగుల కారణంగా గుంటూరు జిల్లాలో నలుగురు, పల్నాడు జిల్లాలో ఒకరు మృతి చెందారు. కాగా భారీ వర్షంతో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. సుమా రు రెండు గంటలకుపైగా కుండపోతగా కురి సిన వర్షంతో గుంటూరు నగరంలోని ప్రధాన రోడ్లపై కూడా నీరు ఉధృతంగా ప్రవహించింది. పలు రహదారులపై మోకాలి లోతులో నీరు నిలిచింది. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. రాత్రి వరకు కూడా వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వర్షం వెలిసిన తర్వాత పాఠశాలలు, కళాశాలల నుంచి ఇళ్లకు వెళ్లలేక విద్యార్థులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. అపార్టుమెంట్లు, దుకాణ సముదాయాల సెల్లార్లతో పాటు కంకరగుంట అండర్‌పాస్, మూడువంతెనల మార్గంలోకి కూడా వరదనీరు భారీగా చేరింది. లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. నగరం మొత్తం జలమయంగా మారడంతో జనజీవనం స్తంభించి పోయింది. పీకలవాగు పొంతడంతో సమీప నివాస ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.



● గుంటూరు కంకరగుంట అండర్ పాస్ దుస్థితి



గుంటూరులోని బ్రాడీపేట 1/18లో వర్షపు నీరు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

భారీ వర్షాలు, ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో (మిగతా 8వ పేజీలో)

కోడెల కాంస్య విగ్రహాన్ని రూపుదిద్దిన తెనాలి శిల్పులు


తెనాలి శిల్పులు రూపొందించిన కోడెల విగ్రహం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెనాలి శిల్పులు దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ కాంస్య విగ్రహాన్ని రూపుదిద్దారు. సూర్య శిల్పశాలలో ఈ విగ్రహాన్ని తయారు చేసేందుకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తెలిపారు. కోడెల 6వ వర్ధంతిని పురస్కరించుకొని వినుకొండలో విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, దీన్ని శనివారం అక్కడకు తరలించామని చెప్పారు. సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో కోడెల తనయుడు శివరామ్ ఏర్పాటు చేసిన 50 ఫైబర్ గ్లాసు విగ్రహాలు ఈ శిల్పశాలలోనే రూపొందాయని వెంకటేశ్వరరావు, రవిచంద్ర చెప్పారు.

తెనాలి రైల్వే స్టేషన్‌లో మూడో లైను ఏర్పాటు


నూతనంగా ఏర్పాటు చేసిన మూడో రైల్వే లైను

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వే స్టేషన్‌లో రెండవ ప్లాట్‌ఫాంలో మూడో రైల్వే లైను వేశారు. ప్లాట్‌ఫాంకు రెండు వైపులా చివర ఉన్న పాత క్యాబిన్‌లను ఆధునీకరణలో భాగంగా ఇటీవల తొలగించారు. క్యాబిన్‌ల తొలగింపు వల్ల ఏర్పడిన స్థలం గుండా మూడో లైనును ఏర్పాటు చేశారు. కృష్ణాకెనాల్ జంక్షన్ నుంచి గూడూరు వరకు ఈ లైనును ఏర్పాటు చేశారు. దాంతో లైన్ సామర్థ్యం పెరిగి ఎక్కువ రైళ్లను పంపే అవకాశం కలిగింది. ఈ లైన్‌లో స్పీడ్ టెస్టును సోమవారం నిర్వహించనున్నారు. స్పీడ్ టెస్ట్ నేపథ్యంలో ప్రయాణికులు లైను ద్వారా రాకపోకలు సాగించవద్దని, ముఖ్యంగా పశువుల పెంపకందారులు ఈ విషయాన్ని గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

పారిశుధ్య సమస్యలు ఎందుకు పరిష్కరించట్లేదు..?

● అధికారులను నిలదీసిన డాక్టర్ పెమ్మసాని ● ప్రభుత్వాసుపత్రిలో కేంద్ర మంత్రి ఆకస్మిక తనిఖీలు


ప్రభుత్వాసుపత్రిలో పర్యటిస్తున్న మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్య సమస్యలు తరచూ ఎందుకు కనిపిస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆసుపత్రి సిబ్బందిని నిలదీశారు. చిన్న చిన్న ట్యాంకర్లు ఏర్పాటు చేసుకుంటే మరుగుదొడ్ల దగ్గర ఇబ్బంది ఉండదు కదా అని ఆయన వారికి సూచించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో శనివారం పెమ్మ సాని ఆకస్మిక తనిఖీలు చేశారు. కేంద్ర మంత్రి వెంట గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు. మంత్రి పెమ్మసాని చికిత్స కోసం వచ్చిన వారిని నేరుగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలను, వివిధ వైద్య పరికరాలు, వైద్యుల పనితీరు తదితర ఏర్పాట్లపై రోగుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రోగులు ఆసుపత్రిలో పారిశుధ్య సమస్యలు, మరుగుదొడ్లలో ఇబ్బం దులు ఉన్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. సూపరిండెంట్ డాక్టర్ రమణ యశస్వితో పాటు శానిటరీ సిబ్బందిని వెంటనే పిలిపించిన మంత్రి పెమ్మసాని సమస్యలకు తగిన పరిష్కారాలను వివరించారు. బకాయి నిధులు రాకపోవడంతో కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయలేక పోతున్నట్లు శానిటరీ అధికారుల వివరణ ఇవ్వగా, బకాయిలను వెంటనే తెప్పించాలని అధికా రులను పెమ్మసాని ఆదేశించారు. తాను కూడా ఈ విషయంపై దృష్టి పెట్టి పెండింగ్ బిల్లులను తెప్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. అనంతరం ఓపి, ఐసీయు, ఎమర్జెన్సీ, వార్డులను పరిశీలించారు. ఇటీ వలే తురకపాలెంలో ఆరోగ్య సమస్యలతో జీజీహెచ్‌లో చేరిన బాధితులను కలిసి ఆయన పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. స్వతహాగా డాక్టర్ అయిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రోగుల చికిత్సల్లో వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు.

రాజ్యాంగ హక్కులను రక్షిస్తున్న కూటమి ప్రభుత్వం

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ
జగన్‌కు, చంద్రబాబుకు చాలా వ్యత్యాసం ఉందంటూ వ్యాఖ్యలు


మాట్లాడుతున్న కేఆర్ సూర్యనారాయణ, పాల్గొన్న సంఘ నేతలు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ సంఘాల గుర్తింపు రద్దు చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను కూటమి ప్రభుత్వం ఉపసంహరించు కోవడంపై సీఎం చంద్రబాబుకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ రోడ్డులో ఏర్పాటు చేసిన జిల్లా సంఘ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాటాడుతూ, ప్రతి నెలా 1వ తేదీన జీతం చెల్లించమంటే తమను అరెస్టు చేయించిన జగన్‌కు, నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని చెప్పిన చంద్రబాబుకు చాలా వ్యత్యాసం ఉందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన బకాయిల కోసం అప్పట్లో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తే, గత వైసీపీ ప్రభుత్వం తనను, తన కుటుంబసభ్యులను తీవ్రంగా వేధించిందని ఆరోపించారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సమస్యలను విని సానుకూలంగా స్పందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులను ఆయన రక్షిస్తున్నారని అభినందించారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలకు సంబంధించి నిధులు లేకపోతే, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీని కోసం వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన్ను కోరామని చెప్పారు. 12వ వేతన సవరణ కమిటీ, ఇతర సమస్యలపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ఈ సందర్భంగా తమ సంఘానికి ప్రతి జిల్లాలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకునేలా ఆదేశాలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కేఆర్ సూర్యనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేశ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా, కేవీఎస్ శివారెడ్డి, అబ్దుల్ రజాక్, లక్ష్మీనారాయణ, హేమలత, సుమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రైల్వేస్టేషన్ నూతన మేనేజర్‌గా శరత్‌బాబు



గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేషన్ నూతన మేనేజర్‌గా మండే శరత్‌బాబు నియమితులయ్యారు. శనివారం ఆయన రైల్వే స్టేషన్‌కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. శరత్‌బాబు ఇప్పటివరకు గుంటూరు రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై స్టేషన్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ కంతేటి చంద్రకిరణ్, సిబ్బంది సీరం అనీల్‌కుమార్, డీ రాజ్‌కుమార్, షేక్ ఖాదర్‌బాషా తదితరులు శరత్‌బాబుకు అభినందనలు తెలియజేశారు.

విద్యుత్‌శాఖలో ఉద్యోగుల విభజన పూర్తి

● పలువురు జూనియర్‌లకు స్థాన చలనాలు
● ఆప్షన్లకు అనుగుణంగా విభజన

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కసరత్తు తరువాత ఏపీ సీపీడీసీఎల్ పరిధిలోని సర్కిల్స్‌కు ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తయింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తరించిన సీపీడీసీఎల్ సర్కిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాలకు ఉద్యోగులను కేటాయిస్తూ సీఎండీ పుల్లారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా పలువురు జూనియర్ ఉద్యోగులకు స్థాన చలనాలు కల్పించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన సర్కిల్స్‌కు ఉద్యోగులను కేటాయించేందుకు అధికారులు ఎన్నో కసరత్తులు చేశారు. కొత్తగా సర్కిల్స్ విభజన చేసినప్పటికీ అందుకు అనుగుణంగా ఉద్యోగులు లేక కార్యాలయాల్లో కూడా పరిపాలన నత్తనడకన సాగుతుందన్న విమర్శలు వచ్చాయి. మధ్యలో సర్కిల్స్‌కు కొత్తగా మార్పులు, చేర్పులు చేయటంతో ఉద్యోగుల విభజనలో కొంత జాప్యం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఉద్యోగుల విభజన ప్రక్రియ ఎంతో కాలంగా పెండింగ్ పడుతూనే వస్తోంది. కొన్ని నెలలుగా పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన ఉన్నతాధికారులు చివరకు విభజన ప్రక్రియను పూర్తి చేశారు. విభజన కోసం ఉద్యోగుల నుంచి ఆప్షన్స్ స్వీకరించారు. వారి ఆప్షన్స్‌కు అనుగుణంగా ఉద్యోగులను సర్కిల్స్‌కు విభజించారు. జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏవో) నుంచి అటెండర్ స్థాయి ఉద్యోగుల వరకు స్థాన చలనాలు లభించిన వారిలో ఉన్నారు. గుంటూరు సర్కిల్ నుంచి అత్యధిక శాతం మందికి పల్నాడు, మిగతా వారికి బాపట్ల సర్కిల్‌కు బదిలీ చేసినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

చేబ్రోలు మండలంలో మెలియాయిడోసిస్ కలకలం..!

● వదంతులు నమ్మవద్దన్న వైద్యాధికారులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ఊర్మిళ

చేబ్రోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామంలో గత కొన్నిరోజులుగా స్థానికులు తీవ్ర జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రతి 10 కుటుంబాలలో ఒకరికి జ్వరలక్షణాలు ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చనిపోయిన ఒకరికి మెలియాయిడోసిస్ వచ్చిందంటూ ప్రచారం జరిగింది. ఈ వార్త విస్తృతంగా ప్రచారమవడంతో జ్వరాలతో బాధపడుతున్నవారు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. క్రమేపి జ్వరాల సంఖ్య పెరగటంతో చేబ్రోలు ప్రాథమిక వైద్యాధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న వారిలో అనుమాన లక్షణాలున్న 9 మందికి రక్త పరీక్షలు చేశారు. వారిలో 5గురికి పాజిటివ్ రాగా నలుగురికి నెగిటివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన 5 గురిలో ఇన్ఫెక్షన్‌కు కారణమైన స్టాఫిలోకోకస్ బాక్టీరియా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ప్రాథమిక వైద్యాధికారి ఊర్మిళ మాట్లాడుతూ, స్టాఫిలోకోకస్ సోకిన వారికి యాంటీబయాటిక్ మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శుక్రవారం చనిపోయిన ఆశా వర్కర్ సులోచనకు ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ ఉందని చెప్పారు. కొత్తరెడ్డిపాలెంలో ప్రజలు వదంతులు నమ్మవద్దని, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు నిరంతరం గ్రామంలో పర్యవేక్షిస్తున్నారని వైద్యాధికారి ఊర్మిళ తెలిపారు.

ఖనిజ లవణాలతో నీటిని అందించాలి

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ తోట ప్రభాకరరావు


చిలువూరులో రక్షిత మంచినీటి సరఫరాను పరిశీలించేందుకు వచ్చిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల బృందం

దుగ్గిరాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఖనిజ లవణాలతో కూడిన తాగునీటిని అందించాలని, రక్షిత మంచి నీటి సరఫరా ట్యాంకులను జల దేవాలయాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్రప్రభుత్వ సలహాదారుడు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ తోట ప్రభాకరరావు అన్నారు. చిలువూరులో రక్షిత మంచినీటి సరఫరా తీరును రాష్ట్రంలో ప లు జిల్లాల నుంచి వచ్చిన 14 మందితో కూడిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈల బృందం శనివారం పరిశీలించింది. తొలుత చిలువూరు గ్రామా నికి నీటిని సరఫరా చేసే పంపు హౌస్‌ను, ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీ లించి, క్లోరినేషన్ చేస్తున్న విధానం గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్యం, వాల్‌పిట్స్, పైపుల ద్వారా ఏ పరిమాణం లో నీటిని అందిస్తున్నారు.. నీటి సరఫరా కుళాయిల ద్వారా జరుగు తుందా, క్లోరినేషన్ చేసిన నీరు చివరి వరకూ వెళుతుందా అన్న అంశాలను కూడా అడిగి తెలుసుకున్నారు. రిపేర్లున్న లైన్ల గురించి తెలుసు కొని వాటిని సరిదిద్దాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రాష్ట్రప్ర భుత్వ సలహాదారుడు, విశ్రాంత చీఫ్ ఇంజనీరు తోట ప్రభాకరరావు మాట్లాడుతూ, క్లోరినేషన్ ద్వారా నీటిలో ఉన్న కంటికి కనబడని బ్యాక్టీరియాను నిర్మూలించవచ్చని, తద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అన్నారు. ఆర్‌ఓ నీటి వినియోగంతో ప్రజలు కీళ్ల వ్యాధుల బారిన పడుతున్నారని, దీన్ని నివారించేందుకు ఖనిజ లవణాలతో కూడిన నీటిని వారికి అందించాలని చెప్పారు. రక్షిత మంచినీటిని సరఫరా చేసే ట్యాంకులను జల దేవాలయాలుగా తీర్చిదిద్దాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ రోజా మరియమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ జవహ ర్‌లాల్, పంచాయతీ కార్యదర్శి శరత్, పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

నాలుగో తరగతి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణను రూపొందించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.రత్నకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘ కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా పరిషత్‌లోని పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. సంఘంలోని ఉద్యోగుల సమస్యలు, వారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిల గురించి చర్చించి పరిష్కార మార్గాలపై కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించారు. ప్రమోషన్లు, సీనియారిటీ లిస్టు తదితర విషయాలలో నాలుగో తరగతి ఉద్యోగులపై చిన్న చూపు తగదని, మిగతా క్యాడర్‌లలో ఇస్తున్న మాదిరిగానే తమకూ ప్రమోషన్లు ఇవ్వాలని విన్నవించారు. రాష్ట్ర సంఘంతో పాటు, ఆయా జిల్లాల సంఘాలలో పదవీ విరమణ చేసిన నాయకుల స్థానంలో తిరిగి సభ్యులను ఎన్నుకోవాలని తీర్మానించారు. నాలుగో తరగతి ఉద్యోగులకు వారికి సంబంధించిన పనులే గాక ఊడ్చే పనులు, నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు చేయిస్తున్నారని, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు జి. రత్న కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రాజేశ్ ప్రభు కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లచ్చన్న, ప్రసాద్, తిప్పే స్వామి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మిగులు జలాలపై తెలంగాణది అనవసర రాద్ధాంతం

● ఏపీ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిగులు జలాలపై తెలంగాణ ప్రభుత్వం అనవసర రాద్ధాంతం చేస్తోందని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆక్షేపించారు. శనివారం గుంటూరులోని బాలానంద కేంద్రంలో ఆలోచనాపరుల వేదిక ఆధ్వర్యంలో నదీ జలాల హక్కుల పరిరక్షణ, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మిగులు జలాలు వాడుకొనే హక్కు చివరి రాష్ట్రం అయిన ఏపీకి ఉందని అన్నారు. ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని తరలించుకోవచ్చని చెప్పారు. ఈ విషయాలన్నీ బచావత్ ట్రైబ్యునల్ గతంలోనే స్పష్టం చేసిందని తెలిపారు. అయినప్పటికీ మిగులు జలాలపై తెలంగాణ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. అంతేకాకుండా కృష్ణా, గోదావరి నదులపై అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తోందని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికంగా హైదరాబాద్‌లోనే అభివృద్ధి కోసం నిధులను వెచ్చించడం జరిగిందని చెప్పారు. గత 40 ఏళ్లలో ఒక్క భారీ ప్రాజెక్టు కూడా కోస్తాంధ్రకు రాలేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాలుగా జరుగుతూనే ఉందని చెప్పారు. రైతుల అవసరాల కోసమే ప్రాజెక్టుల డిజైన్లు, నిర్మాణం జరగాలని వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్



కలెక్టర్‌ని అన్సారియాకు మొక్క అందజేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ.తమీమ్ అన్సారియాను శనివారం కలెక్టర్ చాంబర్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, డీఆర్వో ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా విద్యా శాఖాధికారి రేణుక, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మురళీధర్, డీపీవో నాగ సాయికుమార్, ఉపాధి కల్పన అధికారి దుర్గాబాయి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, ఉద్యాన శాఖ డీడీ రవీంద్రబాబు, కలెక్టరేట్ ఉద్యోగులున్నారు.

జీటీ రోడ్డుపై గుంతలను వెంటనే పూడ్చండి

- ఎమ్మెల్యే గళ్లా మాధవి



రోడ్డుపై గుంతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా గుంటూరు నగరంలో జీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి, ప్రమాదాలను అరికట్టాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. జీటీ రోడ్డును ఆమె శనివారం పరిశీలించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గుంతలను వెంటనే పూడ్చి, ఎప్పటికప్పుడు రోడ్డు పరిస్థితిని పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

- విభిన్న ప్రతిభావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవి హామీ ఇచ్చారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో శనివారం ఆమె ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలని విభిన్న ప్రతిభావంతులు వినతి పత్రం అందించారు. వారి సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మహిళా డిగ్రీ కళాశాలకు అదనపు తరగతి గదులు



మహిళా కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని

- రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో జీప్లస్-2 భవనాలు
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(విద్య), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) నిధులతో అభివృద్ధి చేయడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. శనివారం మహిళా డిగ్రీ కళాశాలను తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పేద విద్యార్థినులు ఎక్కువ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. కళాశాలలో 2500మంది విద్యాభ్యాసం చేస్తున్నారని, నిపుణులైన అధ్యాపకులు ఉన్నా గదుల కొరత ఉందన్నారు. కాలేజీలో 26 కోర్సులు ఉన్నాయని 45 తరగతి గదులు అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రూ2.50 కోట్లతో 12 తరగతి గదులను జీప్లస్ టూ విధానంలో నిర్మిస్తామన్నారు. ఇందుకు కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులు వినియోగిస్తామన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కళాశాలకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా కళాశాల ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొండిగేటు నిర్మాణంతో ముంపు సమస్యకు పరిష్కారం

- ఎమ్మెల్యే నసీర్



లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొండిగేటు నిర్మాణంతో గుంటూరు నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శనివారం కురిసిన భారీ వర్షాలకు నగరంలో నీట మునిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. తాము 24 గంటలూ అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. గుంటూరు నగరంలోని వర్షపు నీరంతా మొండిగేటు ద్వారా గుంటూరు చానల్‌లో కలుస్తుందని, అయితే ఇక్కడ కేవలం 5 మీటర్ల లోతు మాత్రమే ఉందని చెప్పారు. దీంతో వర్షపు నీరు వేగంగా బయటికి వెళ్లే అవకాశం లేక లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించానని, మున్సిపాలిటీతో సంబంధం లేకుండా రైల్వే అధికారులను ఒప్పించి రూ.7.50 కోట్లు మొండిగేటు నిర్మాణానికి మంజూరు చేయించామని వెల్లడించారు. ఈ పనులను వచ్చే మార్చిలో ప్రారంభిస్తామని, అప్పటివరకు గుంటూరు నగరంలో డ్రెయినేజీ వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నామని, ప్రజలకు సహకరించాలని కోరారు.

దుకాణాల పేర్లు తెలుగులో ఉండేలా సిద్ధం చేయండి

- చాంబర్ ఆఫ్ కామర్స్‌కు విజ్ఞప్తి



ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న గజల్ శ్రీనివాస్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో దుకాణాల సూచిక ఫలకాలు తెలుగులో ఉండేలా సిద్ధం చేయాలని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, ఏల్చూరి వెంకటేశ్వరావుకు వారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ జనవరి 3, 4, 5 తేదీల్లో గుంటూరులోని శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో తెలుగు మహాసభలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో నగరంలో ప్రతి వ్యాపార సంస్థ తమ ప్రకటనలు తెలుగుభాషలో ప్రచురించేలా, ఫ్లెక్సీలు, బోర్డులు, సైను బోర్డులో తెలుగు అక్షరాలతో ఉండేలా చూడాలని వ్యాపారులను కోరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు అన్నాప్రగడ రవి శ్రీనివాస్, మనోజ్ కమల్, కత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు నగర ప్రజలకు మెరుగైన వసతులు

కేరళ అర్బన్ కాన్‌క్లేవ్-2025 సదస్సులో మేయర్ కోవెలమూడి రవీంద్ర




సదస్సులో పాల్గొన్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. 'కేరళ అర్బన్ కాన్‌క్లేవ్- 2025' సదస్సులో మేయర్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో రెండు రోజుల పాటు జరిగిన అర్బన్ కాన్‌క్లేవ్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల కార్పొరేషన్ల మేయర్లు, కమిషనర్లు, పట్టణాభివృద్ధి నిపుణులు పాల్గొని, నగరపాలక సంస్థల్లో, పట్టణాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించామని తెలిపారు.

..గుర్తుకు రావడంలేదు

● పేర్లు, ఫోన్ నెంబర్లపైనా తడబాటు ● రోజురోజుకు పెరిగిపోతోన్న మతిమరుపు



గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోను.. సొల్లుఫోనుగానే కాకుండా రకరకాల మానసిక, శారీరక వ్యాధులకు కారణంగా మారుతోంది. సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారిన వారిలో అనేక వ్యాధులు కనిపిస్తున్నాయి. వాటిలో డిజిటల్ డిమెన్షియా ఒకటి. సన్నిహితులు, ఫోన్ నెంబర్లు, కుటుంబసభ్యులు, దగ్గరి బంధువుల వివరాలు చెప్పలేని పరిస్థితి, మెదడు గజిబిజితో చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా ఇబ్బందులు పడటం సర్వ సాధారణంగా మారింది. సాంకేతిక అధిపత్య యుగంలో మొబైల్ ఫోను, ట్యాబ్, కంప్యూటర్, టీవీ ఇతర సాంకేతిక పరికరాలు వినియోగం పెరిగింది. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వీటితో కాలక్షేపం చేసున్నారు. దీంతో గతంలో వృద్ధులలో సాధారణంగా కనిపించే డిమెన్షియా(చిత్త వైకల్యం) బారిన ఇప్పుడు చిన్న పిల్లలు, యువత పడు తున్నారు. నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు విజ్ఞానం, సృజనాత్మకతను దెబ్బతీస్తుంది. దీంతో చిన్న చిన్న విషయాలను కూడా మరిచిపోతు న్నారు. ఈ సమస్య ఎక్కువగా మహిళలో కంటే మగవారిలో కనిపిస్తుంది.

మెదడుపై ప్రతికూల ప్రభావం

సాధారణంగా చదవడం, రాయడం ఇతర పనుల్లో మెదడు క్రియాశీలకంగా పనిచేస్తుంది. ఆదే మొబైల్ ఫోనులో వీడియోలు, గేమ్స్, సినిమాలు చూడటం చేస్తున్నప్పుడు చుట్టూ ఏం జరుగుతుందో కూడా గ్రహించలేకపోతున్నారు. డిజిటల్ తరగతుల రూపంలో విద్యార్థుల్లో స్క్రీన్ వినియోగం గణనీయంగా పెరిగింది. పాఠశాల, కళాశాలల్లో సైతం ప్రాజెక్ట్ వర్కుల పేరుతో ఈ వినియోగం మరితంగా పెరిగింది. ఇంటర్‌నెట్‌లో శోధించడంతో మెదుడుకు పని చెప్పడం లేదు. దీంతో జ్ఞాపకశక్తి మీద ప్రభావం చూపుతోంది. దీంతో మెదడు డీయాక్టివ్ అవుతుంది. చిన్నపిల్లల్లో అయితే ఆటిజం వంటి తీవ్ర దుష్ప్రభావాలు తలెత్తున్నాయి.

పెరుగుతున్న డిజిటల్ డిమెన్షియా

డిజిటల్ డిమెన్షియా బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారు. మొబైల్ అతివినియోగంతో ఈ సమస్యలు ఎదురువుతున్నాయి. సాధారణంగా చిన్నపిల్లల్లో ఆరేళ్ల వరకు మెదడు ఎదుగుతుంది. కాని చాలామంది తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్లు అలవాటు చేస్తున్నారు. దీంతో మెదడు ఎదుగుదల ఆగిపోతుంది. పిల్లలను ఫోన్లుకు కాకుండా మైదానపు క్రీడలకు అలవాటు చేయాలి. డిమెన్షియాను తొలిదశలో గుర్తించి వైద్యులను, మానసిక నిపుణులను సంప్రదించాలి.

-డాక్టర్ వెంకట కిరణ్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, గుంటూరు





గుంటూరు : మూడొంతెనల వద్ద ముంపు



గుంటూరు : బ్రాడీపేట 18 అడ్డరోడ్‌లో...

పిడుగుల వాన

(5వ పేజీ తరువాయి)

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంని ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎలాంటి సాయం అవసరమైనా నంబరు. 0863 2234014కి ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. 24 గంటలు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా షిఫ్టుల వారీగా డ్యూటీలు వేశా రు. ఆయా అధికారులను సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసేందుకు హ్యాం రేడియో సెక్రెటరి వీఎస్‌ఆర్ ప్రసాద్‌కు కలెక్టర్ బాధ్యతలు కేటాయించారు.

పొలం పనుల్లోనే ప్రాణాలు పోయాయి..

శనివారం పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. వర్షాలతో సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు పిడుగుల ధాటికి బెంబేలెత్తిపోయారు. పెదకాకాని మండలం నంబూరు, పెదనందిపాడు మండలం అన్నవరప్పులో పొలం పనులు చేస్తున్న నలుగురు కూలీలు పిడుగుపాటుకు మృతి చెందారు.

- పెదకాకాని మండలం నంబూరులోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన దాసరి సౌరమ్మ(39), దాసరి రాణి(41), పాముల మణి, ఎర్రమోతు మరియమ్మ, దాసరి ప్రేమావతి తదితరులు శనివారం గ్రామ శివారులోని పొలంలో కలుపు తీస్తున్నారు. వర్షం పడటంతో చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడింది. దీంతో సౌరమ్మ, రాణి అక్కడికక్కడే మృతి చెందారు. మణి, మరియమ్మ, ప్రేమావతిలకు తీవ్రగాయాలు కాగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులు సౌరమ్మ, రాణిలు వరసకు తోడికోడళ్లు అవుతారు. ఒకే బజారులో పక్కపక్క ఇళ్లు కావటంతో అంబేద్కర్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.
- పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన తన్నీరు నాగేంద్రం(49), దేవరపల్లి సామ్రాజ్యమ్మ(61) గ్రామ శివారులోని పొలాల్లో కూలి పనులకు వెళ్లారు. వర్షంతో ఇంటికి వస్తుండగా చాకలి చెరువు సమీపంలో వారిపై పిడుగు పడింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పరిశీలించిన ఇన్‌చార్జి ఎస్‌ఐ పృద్వీఏక్‌నాథ్, డీటీ కరిముల్లా వారి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.
- పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన దానుపాటి వెంకటేశ్వర్లు(63) గేదెలతో పొలం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో అతడి సమీపంలో పిడుగు పడింది. దీంతో అపస్మారక స్థితికి వెళ్లిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారులు ఉన్నారు.



గుంటూరు : ఏటి అగ్రహారం 16వ లైను..



గుంటూరు : చుట్టుగుంట అన్న క్యాంటీన్ వద్ద..

వైసీపీ మైనార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదు : లాల్ వజీర్

గుంటూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ మైనార్టీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం మైనార్టీ నేతలు పలువురు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైజన్లు, ఇమాములకు డబ్బులు ఇవ్వట్లేదని వైసీపీ నేతలు ధర్నా చేయడం బాధాకరమన్నారు. వైసీపీ పాలనలో పెండిం గులో ఉన్న ఆరు నెలల గౌరవం వేతనం రూ.45 కోట్లు కూడా కూటమి వచ్చాక చంద్రబాబు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో అబ్దుల్ గని, హుస్సేన్, చిన్నబాజీ, బాజీ మాస్టారు, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

జగన్నాటకం అందరికీ తెలుసు : జాస్తి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జగన్ అధికారంలో ఉన్నప్పుడు అమరా వతిని ఎన్ని విధాలుగా భ్రష్టు పట్టించిన సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నా రు. ఇప్పుడు ప్రజలను మోసం చేయడానికి జగన్ నాటకాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. గుంటూరులో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ తమ అధికారంలోకి వస్తే అమరావతి నుంచి పరి పాలన కొనసాగిస్తామని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పటం హాస్యాస్పదమన్నారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్పీగా నియమితులైన వకుల్ జిందాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా జిల్లాలకు నియమితులైన ఎస్పీలతో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జిందాల్ హాజరయ్యారు. ఆదివారం ఉదయం ఆయన ఎస్పీగా బాధ్య తలు చేపట్టనున్నారు. రాజధాని జిల్లా కేంద్రం కావడంతో పాటు వచ్చేవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహణతో పాటు పోలీస్ శాఖను సన్నద్ధం చేయాల్సిన నేపథ్యంలో ఆయన వెంటనే బాధ్యతలు స్వీకరించాలని నిర్ణయించారు.

ఫార్మసీ నూతన సిలబస్‌పై అధ్యాపకులకు అవగాహన : సీపీఐ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రవేశ పెట్టే నూతన సిలబస్‌పై అధ్యాపకులు అవగాహన ఉండాలని కౌన్సిల్ సభ్యుడు నిరంజన్ విజ్ఞప్తి చేశారు. శనివారం చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్‌లో అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఫా ర్మసీ అసోసియేషన్, ఐపీఏ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వ హించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సూర్యదేవర విద్యాధర అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పద్మావతి మహిళా ఫార్మసీ కళాశాల సీని యర్ ప్రొఫసర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఎస్టీయూ సత్కారం

గుంటూరు(విద్య), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీల జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయుల్ని ఎస్టీయూ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షత వహించారు. ఏపిఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యద ర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా సమాజ అభివృద్ధికి, విద్యాభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే. కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల్ని సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ రణభేరి

● రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి



మాట్లాడుతున్న ఏఎన్ కుసుమకుమారి

గుంటూరు(విద్య), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఇచ్చిన ఆర్థిక హామీలను నెరవేర్చాలని, విద్యా రంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 19 వరకు రణభేరి కార్యక్రమం చేపడుతున్నట్లు రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి వెల్లడించారు. శనివారం బ్రాడీపేటలోని యూటీ ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమా నికి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కోశాధి కారి ఎన్ తాండవకృష్ణ, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి దౌలా. జిల్లా కార్య దర్శులు ఆదినారాయణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ 2003 అభ్యర్థుల ఆందోళన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డీఎస్సీ 2003 అభ్యర్థులు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఎస్సీ 2003 అభ్యర్థులు నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియలో జరిగిన జాప్యం వల్ల కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ పరిధిలోకి వచ్చామని 2003 డీఎస్సీ ఫోరం జిల్లా కన్వీనర్స్ సలగాల. ప్రసన్నకుమార్, శీలం యలమంద తదిత రులు ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థుల చట్టబద్ధమైన హక్కులను ప్రభుత్వ కాలరాస్తుం దన్నారు. అభ్యర్థుల సమస్యలు పరిష్కరించకుండా ఆర్థిక శాఖ జాప్యం చేస్తుందని ఫోరం రాష్ట్ర కన్వీనర్ మోపిదేవి శివశంకరరావు ఆరోపించారు. తొలుత అభ్యర్థులు కొరిటిపాడు సెంటర్ నుంచి లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనం తరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు సమర్పించారు.

నిరాశ్రయులకి భోజనం అందజేత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆహమద్ ఆదేశాల మేరకు 15వ డివిజన్ కూటమి నాయకులు పేదలకు, నిరాశ్రయులకు ఆహార ప్యాకెట్లును పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారి వెంబడి జీవిస్తున్న కుటుంబాలు వర్షాల కారణంగా ఇబ్బం ది పడుతున్న విషయాన్ని గమనించి భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు సూరె శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు షాజహాన్, మీరావలి, తాజు తదితరులు పాల్గొన్నారు.

అమర వీరులకు ఘన నివాళులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదా కాలనీ, స్థూపం సెంటర్ వద్ద మామిళ్లపల్లి మాలకొండయ్య, గుర్రం బ్రహ్మయ్య అమర వీరుల సంస్మరణ సభ జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రజానాయకుల త్యాగస్ఫూర్తిని స్మరించుకున్నారు. అమరజీవుల త్యాగ స్ఫూర్తి కొత్త తరాలకు మార్గదర్శకం అవ్వాలన్నారు.

ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించాలి

● ప్రజాప్రతినిధులకు ఏపీటీఎఫ్ నాయకుల వినతులు



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారంలో కూటమి ప్రభుత్వం సాచివేత ధోరణిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం చేపట్టిన నిరసన వారం కార్యక్రమంలో భాగంగా శనివారం సంఘం నాయకులు ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రజాప్రతినిధు లకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించి పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయ కులు కోరారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీద్, పలనాడు జిల్లా శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్, గడిపాటి దాస్, బాల్ల శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం,శివారెడ్డి, మాలకొండయ్య, శ్రీధర్,సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి గుంటూరుకు స్వచ్ఛభారత్ మిషన్ అధ్యయన బృందాలు



అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరే షన్), సెప్టెంబ రు 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ జాతీయ స్థాయి లో స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్‌లో ఉత్త మ స్థానం సాధించడంతో కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్ అధ్య యన బృందాలు ఈ నెల 16 నుంచి గుంటూరు నగరానికి రానున్నాయని, జాతీయస్థాయిలో అందిన స్ఫూర్తితో గుంటూరు నగరాన్ని మరింత సుందర నగరంగా తీర్చిదిద్దుకోవడంలో నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ప్రజారోగ్య కార్మికులు సమష్టిగా కృషి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో విభాగాధిపతులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులుం, నోడల్ అధికారులతో నగరంలో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్లు, సిటీ ప్లానర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే మెరు గైన ఆరోగ్యం లభిస్తుందని, ఇళ్ల నుంచి వ్యాపార వాణిజ్య సంస్థల వారు వ్యర్థాలను రోడ్లు లేదా డ్రెయిన్లలో వేయవద్దని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం జేకేసి రోడ్, అరండల్‌పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈలు రమేష్‌బాబు, శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాల య కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 11388 కేసులు పరిష్కారం

గుంటూరు(లీగల్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని కోర్టులలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 11138 కేసులు పరిష్కరించినట్లు సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యం లో గుంటూరు నగరంలోని అన్ని కోర్టులకు కలిపి 16 బెంచీలు జిల్లాలోని మిగిలిన అన్ని కోర్టులో 25 బెంచీలను ఏర్పాటు చేసి రాజీమార్గంలో కేసులను పరిష్కరించామని చెప్పా రు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో ఓ వాహన ప్రమాదంలో శ్రీనివాసులు అనే వ్యక్తి మృతికి సంబంధించి అతని కుటుంబసభ్యులు వేసిన ప్రమాద బీమా క్లెయిమ్ కేసును రాజీ చేసి యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా మొత్తం రూ.1,11,82,343ను చెక్కు ద్వారా వారికి ఇప్పించారు.



రూ.1,11,82,343 చెక్‌ను శ్రీనివాసులు కుటుంబసభ్యులకు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి

వ్యాపార వర్గాలకు అండగా చాంబర్ ఆఫ్ కామర్స్

● చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార వర్గాలకు ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎప్పుడూ అండగా ఉంటుందని చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్‌లో ఇటీవల కన్నుమూసిన చాంబర్ ఈసీ మెంబర్ మలిశెట్టి రమేష్ బాబు సంతాపసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆతుకూరి మాట్లా డుతూ రమేష్‌బాబు సుదీర్ఘకాలంగా చాంబర్ ఈసీ మెంబర్‌గా ఉంటూ వ్యాపారవర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. అలానే రమేష్ బాబు కుటుంబానికి చాంబర్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చా రు. చాంబర్ జిల్లా అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రమేష్ బాబు మృతి చాంబర్‌కు తీరనిలోటన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చాంబర్ కార్యవర్గం గొల్లపూడి కాశీ రాంబాబు, షరాబు కృష్ణమూర్తి, నాగిరెడ్డి తదితరులున్నారు.

కేబుల్స్ కట్టలతో విద్యుత్ పోల్‌కు మంటలు

● అధికారుల అప్రమత్తతో తప్పిన పెను ముప్పు
● మంటలు ఆర్పివేసిన అగ్నిమాపకశాఖ



విద్యుత్ పోల్‌పై ఎగిసిపడుతున్న మంటలు

గుంటూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పోల్స్‌కు కట్టలు కట్టలు గా కట్టిన కేబుల్ వైర్లతో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన శనివారం డొంక రోడ్డు ప్రాంతంలో జరిగింది. పోల్‌పై నుంచి కింది వరకు మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదే సమయంలో అటుగా వస్తున్న స్థానిక డీ 3 ఏఈ చంద్రశేఖర్ సంఘటన తెలుసుకొని అప్రమత్తమై వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ లోగా సమాచారం తెలుసుకొన్న అగ్నిమాపకశాఖ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పివేశారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పశ్చిమ డెల్టాకు 3,007 క్యూసెక్కులు

దుగ్గిరాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 3,007 క్యూసెక్కు నీరు శనివారం విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 180, రేపల్లె కాల్వకు 1775, తూర్పు కాల్వకు 561, పశ్చిమ కాల్వకు 219, నిజాంపట్నం కాల్వకు 433, కొమ్మమూరు కాల్వకు 2,980 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కు అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం గ్రామానికి చెందిన నూతక్కి నాగరాజుకు ముఖ్య మంత్రి సహాయ నిధి కింద రూ.75,027లను మంత్రి లోకేశ్ మంజూరు చేయించారు. చెక్కును టీడీపీ నేతలు శనివారం నాగరాజు ఇంటికి వెళ్లి అందజేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, మద్దినేని సుబ్రహ్మణ్యం, షేక్ నాగుర్ వలి, షేక్ ఇమాంసా, కంచర్ల కోటేశ్వరరావు, ఫిరోజ్, గఫూర్, కరీమా, నాగూర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

సైడు కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాలీ

తాడేపల్లి (ఉండవల్లి), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండవల్లి సచివాలయం సమీపంలో రహదారి మలుపు ప్రమాదభరితంగా మారింది. శనివారం యూరియా లోడుతో వెళ్తున్న మినీ ట్రాలీ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి సైడు కాలవలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ ఎవరికి ప్రమాదం జరగలేదు. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేస్తే ప్రమాదాలు నివారించవచ్చని స్థానికులు అంటున్నారు.

బాధితులకు రూ.5లక్షల పరిహారం అందించాలి: సీపీఎం

పెదనందిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిడుగు పాటుకు గురై మృతిచెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేశ్‌బాబు కోరారు. మృతి చెందిన మహిళా కూలీల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా కనికళ్ల చిరంజీవి


కనికళ్ల చిరంజీవి

మంగళగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టరుగా మంగళగిరికి చెందిన కనికళ్ల చిరంజీవి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన మూడు కార్పొరేషన్ల డైరెక్టర్ల జాబితాలో చిరంజీవికి అవకాశం లభించింది. పలువురు నేతలు అభినందనలు తెలిపారు.

స్వర్ణకార సంఘం నూతన కమిటీ ఎన్నిక


నాగరాజు, నారాయణ, బాలకృష్ణ

మంగళగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షరాబ్ బజారులో స్వర్ణకారుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొట్టుముక్కల నాగరాజు, కార్యదర్శిగా బట్టు నారాయణ, కోశాధికారిగా జొన్నాదుల బాలకృష్ణను ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

అమరావతిపై మళ్లీ డ్రామా మొదలు


నాగరాజు

తుళ్లూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిపై మళ్లీ వైసీపీ నాయకులు డ్రామా మొదలు పెట్టారని తుళ్లూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు, సీఆర్డీఏ అడ్వైజరీ, సిటిజన్ కమిటీ మెంబరు యర్రగోపు నాగరాజు అన్నారు. రాష్ట్ర రాజధాని అనే ఆటను రక్తి కట్టించడానికి సజ్జల రామకృష్ణారెడ్డితో జగన్‌రెడ్డి మాట్లాడిస్తున్నారన్నారు. అమరావతి రైతులు వైసీపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఇప్పటికైనా అమరావతిపై కుటిల బుద్ధి ప్రదర్శించకుండా ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలని శనివారం సోషల్ మీడియా వేదికగా నాగరాజు హితవు పలికారు.

విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవాన్ని జయప్రదం చేయండి

● ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్

తుళ్లూరు, (ఉద్దండ్రాయునిపాలెం) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని మోదీ భూమి పూజ చేసిన ప్రదేశంలో ఈ నెల 17న భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సృష్టి పేరుతో నిర్వహిస్తున్న విశ్వకర్మ యజ్ఞోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం భూమి ప్రదేశంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ కులాలు, సంఘాలు, చేతి వృత్తుల వారు అమరావతి ప్రాంత ప్రజలు, రాజధానికి భూములు ఇచ్చిన ప్రజలు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజే ప్రధాని మోదీ జన్మ దినం కావటం కూడా విశేషమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రయోజనాల కోసం చేస్తున్న ఈ యజ్ఞ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయవలసిందిగా రామకృష్ణ యాదవ్ కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్టీసీ సెల్ కో కన్వీనర్ కే హేమ సుందర్, బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తాడికొండ నియోజకవర్గం కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మనబోయిన రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు, కాలనీలు జలమయం

దుగ్గిరాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమై, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దుగ్గిరాలలోని రథం బజార్, రైలుపేట వంతెన నుంచి బోసుబొమ్మ సమీపం వరకు దుగ్గిరాల సబ్‌స్టేషన్, యార్డు ఆవరణ పూర్తిగా వర్షపునీటితో నిండిపోయింది. డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. యాదవపాలెంలో పలుచోట్ల డ్రెయినేజీ ఆక్రమణకు గురికావడంతో వర్షపునీరు, మురుగునీరు కలిసి నిలిచిపోతోంది. శాశ్వత ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


దుగ్గరాల: వర్షపునీటితో నిండిన దుగ్గిరాల రైలుపేట


మేడికొండూరు: ప్రవహిస్తున్న కొండ వాగు

పొంగి ప్రవహిస్తున్న కొండ వాగు

మేడికొండూరు సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి మేడికొండూరు గ్రామం వద్ద కొండ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామంలోని యడ్లపాటి వెంకట్రావు కాలనీకి వెళ్లే రోడ్డు లోలెవెల్ చప్టాపై భారీ స్థాయిలో వరద నీరు పారుతోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాలనీ వాసులకు లో లెవల్ బ్రిడ్జి తప్ప వేరే మార్గం లేకపోవడంతో భారీ వర్షాలు పడినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు అనేకసార్లు మొర పెట్టుకున్నారు.

ఫిరంగిపురంలో భారీ వర్షం

ఫిరంగిపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 72.2 మిల్లీ మీటర్లు వర్ష పాతం నమోదైందని తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. గ్రామంలోని గుంటూరు - కర్నూలు రహదారిలోని పలు దుకాణాల్లోకి వర్షపు నీరు ప్రవహించింది. అలాగే విజ్ఞానపురంలోని మరియమాత మందిరం వెనుక బజారులో కాలువ పైకి నీరు ప్రవహించి పక్కనే ఉన్న గృహాల్లోకి చేరిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ముట్లూరులో వేడుకగా గణేశ్ నిమజ్జనోత్సవం

● పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్ల

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముట్లూరు గ్రామంలోని మహాలక్ష్మమ్మ చెట్టు బజారులో స్థానిక వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 18 అడుగుల గణనాథుడి విగ్రహ నిమజ్జన కార్యక్రమం శనివారం రాత్రి వేడుకగా జరిగింది. గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తొలిసారిగా గ్రామానికి చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు వీరికి ఘన స్వాగతం పలికారు. గ్రామ సెంటర్‌లో గజమాలను అలంకరించారు. స్థానిక ఎంపీటీసీ గోగినేని కల్యాణ చక్రవర్తి, గోగినేని వాసు, స్థానిక వివేకానంద్ యూత్ బృందం సాదరంగా పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే గణనాథుని వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, మన్నవ వంశీ, కల్యాణ చక్రవర్తి, గోగినేని వాసు, స్థానిక పెద్ద అప్పయ్య పాల్గొన్నారు.


లడ్డుతో ఎంపీటీసీ గోగినేని కల్యాణచక్రవర్తి, ఉప్పుటూరి చినరాములు


కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్లకు గజమాలతో స్వాగతం

లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఇద్దరూ విజేతలే

● సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఇఫ్రత్ ఫాతిమా

మంగళగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఇద్దరూ విజేతలే అని మంగళగిరి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఇఫ్రత్ ఫాతిమా అన్నారు. శనివారం డీఎల్ఎస్ఏ నేతృత్వంలో ఎంఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాతిమా మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని సమయం డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు మాట్లాడుతూ షరతులు రాసుకునేటప్పుడు ఇరు పార్టీల న్యాయవాదులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ గత లోక్ అదాలత్‌లో మంగళగిరి నుంచి కేసులు ఎక్కువగా రాజీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లంక శివరామ్ ప్రసాద్, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు కొసనం శ్రీనివాసరావు, శీలం చైతన్య, సత్యాల బాలశౌరి, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీసులు సిబ్బంది, ఎంఎల్ఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఫాతిమా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బూర్ల


కలెక్టర్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమిమ్ అన్సారియాను శనివారం కలెక్టరేట్‌లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జేసీ అశుతోష్ శ్రీ వాత్సవ్, ఎమ్మెల్యే కలిసి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

సీతారాం ఏచూరి జీవితం ఆదర్శం

తాడేపల్లి (ఉండవల్లి), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీతారామ్ ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం రాజధాని డివిజన్ కమిటి కార్యదర్శి ఎం.రవి అన్నారు. శుక్రవారం రాత్రి ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లో సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సీతారామ్ ఏచూరి వర్ధంతి సభలో నేతలు పాల్గొని నివాళులర్పించారు. తొలుత సీతారామ్ ఏచూరి, వీరనారి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజకవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జా సుబ్బారావు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, బక్కిరెడ్డి, రామారావు, జగదీశ్వర్‌రెడ్డి, పార్థసారథి, శివయ్య, గాంధి పాల్గొన్నారు.

ఘనంగా 'సెయింట్ మేరిస్'.. కళాశాల స్నాతకోత్సవం


గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థినికి పట్టా ప్రదానం

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగర శివారు బుడంపాడు సమీపంలోని సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థినిలు వారి కళాశాల మిత్రులు, అధ్యాపకుల సమక్షంలో స్నాతకోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీకే రావు, కళాశాల ప్రెసిడెంట్ భారతి దేవి పాల్గొని విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. అనంతరం కేవీకే రావు మాట్లాడుతూ విద్యార్థులు సంపాదించుకున్న విజ్ఞానం సమాజ అభివృద్ధికి దోహదం చేస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ సోలమన్ రాజు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజేశ్వర రావు, అకాడమిక్ డీన్ డాక్టర్ రూపేష్ కుమార్, క్యాంపస్ ఇంచార్జి అశోక్ పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద పెరిగిన వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరిగింది. ఎగువన ఉన్న పులి చింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 1,66,930 క్యూసెక్కుల వరదనీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదయి న్నట్టు ఇరిగేషన్‌శాఖ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వా యర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదవుతుండగా దిగువ కు 1,58,175 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు చెప్పా రు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 5,748 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3,007 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు చానల్ కాలువకు నీటి విడుదలను నిలిపివేసినట్లు జేఈ రాజేశ్ చెప్పారు.

రవీంద్ర భారతిలో గ్రాండ్ పేరెంట్స్ డే


చిన్నారులను ఆశీర్వదిస్తున్న పెద్దలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు జరిగాయి. చిన్నారులు అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మల వద్ద ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, సరళ, ప్రిన్సిపాల్ వేమూరి డానియేల్, ఏట శిరీష, రమాదేవి, తేజస్విని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి ఇంజనీర్ల పాత్ర కీలకం

● డాక్టర్ మలినేని పెరుమాళ్లు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని మలినేని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్లు అన్నారు. సోమవారం భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల నేపథ్యంలో కళాశాలలో నిర్వహిస్తున్న.. సృజనాత్మక సాంకేతిక నైపుణ్యం, టెక్నాలజీ ప్రాముఖ్యతపై పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇంజనీరింగ్ డే రోజున సన్మానించి బహుమతులు అందజేయనున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ జె.అప్పారావు వెల్లడించారు. డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర రావు, డీన్, విభాగాధిపతులు రమేష్ బాబు, వీర స్వామి, రవి కిరణ్, హరికృష్ణ, జయరావు, సునీత పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించాలి

● బీసీవై అధినేత రామచంద్రయాదవ్


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించి ఆదుకోవాలని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన తురకపాలెంలో పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు మూడు నెలలుగా తురకపాలెంలో అసహజ మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మరణించిన వారిలో ఎక్కువ మంది పురుషులే ఉన్నారని, అలాగే చనిపోయిన వారిలో మధ్య వయస్కులే ఎక్కువగా ఉండటం బాధ కలిగిస్తోందన్నారు. గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

గుడ్ షెఫర్డ్ కాన్వెంట్‌లో బాలల పార్లమెంట్


బాలల పార్లమెంట్‌కు ఎన్నికైన విద్యార్థులు

తుళ్లూరు, (వడ్డమాను) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డమాను గ్రామంలో గల గుడ్ షెపర్డ్ కాన్వెంట్‌లో డా.బీ ఆర్ అంబేద్కర్ బాలల పార్లమెంట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సిస్టర్ విద్యా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నికైన పార్ల మెంట్ మంత్రుల చేత ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక మాన్ని ఉద్దేశిస్తూ సిస్టర్ విద్యా మాట్లా డుతూ బాల బాలికలు చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. సమాజంలోని సమస్యలను గుర్తించి, స్థానిక అధికా రుల దృష్టికి తీసుకెళ్లి వాటికి పరిష్కార మార్గాలు కనుగొనే విధంగా ఈ కార్యక్రమంలో పిల్లలకు తర్ఫీదు ఇచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 68 మంది బాల బాలికలు, గుడ్ షెపర్డ్ స్వచ్ఛంధ సంస్థ సిబ్బంది అనిల్ కుమార్, నాగమణి, ఏ పోతురాజు, స్థానిక ఆషా వర్కర్లు పాములపాటి లక్ష్మీ, దార్ల రాణి, జొన్నకూటి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కాజలో ఉచిత వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మంగళగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిమ్మగడ్డ రామమోహన రావు విజ్ఞాన కేంద్రం, సింహాద్రి శివారెడ్డి, బసవ పున్నయ్య మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కాజ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ తరపున వైద్య సేవలు అందించారు. మొత్తం 153 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 43 మందికి శుక్లాల ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. ఈమని అప్పారావు, వుద్దంటి దుర్గారావు, సింహాద్రి సుమ, గడ్డం అజయ్‌కుమార్, సింహాద్రి ఆదిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునర్నిర్మించాలి


ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్నిర్మించాలని, బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ నేత వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం ఉండవల్లి సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. గ్రూప్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం చలో విజయవాడకు భవన నిర్మాణ కార్మికులు విచ్చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కార్యాలయానికి కార్మికులు భారీగా రావాలన్నారు. ప్రకాష్‌నగర్, మహానాడు, సుందరయ్యనగర్, తాడేపల్లి, నులకపేట ప్రాంతాలలో మీటింగ్‌లు నిర్వహించారు. దుర్గారావు, వెంకటేశ్వర్లు, నార్నే నాగేశ్వరరావు, భుజంగ రావు, శాస్త్రి, ప్రభాకర్, ఖాజావలి, చంద్ర శేఖర్, బాబూరావు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఉప సంహరించుకోవాలి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అందే దిలీప్ శనివారం డిమాండ్ చేశారు. కళాశాలల ప్రైవేటీకరణతో ప్రభుత్వం మరో చారిత్రాత్మక తప్పిదానికి పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో వైద్యవిద్యను పేద, మధ్యతరగతి విద్యార్థులకు దూరం చేసే కుట్రను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

జనరేటివ్ ఏఐతోనే ఉద్యోగ అవకాశాలు

చేబ్రోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులోని ఆర్‌వీఐటీ కళాశాలలో జనరేటివ్ ఏఐపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. ఆర్‌వీఐటీ, నెక్స్ హబ్ టెక్నాలజీస్ సంయుక్తంగా జనరేటివ్ ఏఐ, దాని వినియోగాలు అనే అంశం పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. బీటెక్, ఎమ్మెస్సీ విద్యార్థుల కోసం ఈ వర్క్‌షాపు ఏర్పాటు చసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణయ్య తెలియజేశారు.

పిడుగు కారణంగా నిలిచిన విద్యుత్ సరఫరా

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెనాలి-చక్రాయపాలెం మార్గంలో శనివారం మధ్యాహ్నం పిడుగు కారణంగా విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. పట్టణంతో పాటు రూరల్ మండల గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఈ మార్గంలో బుర్రిపాలెం ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పడిన పిడుగు కారణంగా విద్యుత్ లైన్ల దెబ్బతిన్నాయి. నాలుగు గంటల పాటు విద్యుత్ సిబ్బంది శ్రమించి మరో ట్రాన్స్‌ఫార్మర్ నుండి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పిడుగు కారణంగా చక్రాయపాలెం, బుర్రిపాలెం, పట్టణంలోని నాజరుపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

రక్షణ సైన్యం చర్చిలో మహిళలకు అవగాహన

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): యుక్త వయసులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలకు డాక్టర్ జీవనలత సూచించారు. ఐతానగర్ రక్షణ సైన్యం చర్చిలో శనివారం యువతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 350మంది మహిళలతో హోమ్ లీగ్ ర్యాలీ చేశారు. 14-30 ఏళ్లలోపు మహిళల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో చెన్నై నుంచి వచ్చిన రజియా గుర్నామ్‌కు స్వాగతం పలికారు. సునీతకుమారి, సీయోనుకుమారి, మరియమ్మ, సుజాత, హైమావతి, క్రీస్తుదాను ప్రసంగించారు.

చైతన్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో వేడుకలను ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఏజీఎం మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధి అవకాశాలు అందుకోవాలంటే ఇంటర్ సబ్జెక్టులో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తిరుపతిరావు, రజనీబాబు, ఏడుకొండలు, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ పర్యవేక్షించారు.

బాలికలకు కూచిపూడి నృత్య పోటీలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో శనివారం బాలికలకు నృత్య పోటీలు నిర్వహించారు. రెయిన్‌బో ట్రస్ట్, శ్రీలక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళా క్షేత్రం ఆధ్వర్యంలో ట్రస్ట్ ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి, పోటీలను ప్రారంభించారు. 1వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న బాలికలకు క్లాసికల్ సోలో, వెస్ట్రన్ సోలో, గ్రూపు డాన్స్, ఫోక్ డాన్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బంగారు, వెండి నాణేలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ట్రస్ట్ నిర్వాహకురాలు డాక్టర్ జీవనలత, వరలక్ష్మి, జ్యోతి, భవానీ, అనురాధ, వసంత, భవ్య పాల్గొన్నారు.



నృత్య పోటీలు ప్రారంభిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

భారీ వర్షం..జలమయం



కొల్లిపరలో పసుపు తోటలోకి చేరిన వర్షపు నీరు



కొల్లిపర మండలం పిడపర్తిపాలెం సమీపంలో అరటితోటను చుట్టిముట్టిన వర్షపు నీరు



కొల్లిపర శివారు గుదిబండివారిపాలెంలో జామతోటలోకి చేరిన వర్షపునీరు

కొల్లిపర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకువచ్చి ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించింది. మూడు గంటలసేపు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. కొల్లిపరలో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. తూములూరు ఎస్సీ కాలనీలో గృహాల చుట్టూ వర్షపు నీరు చేరుకోవడంతో గంటల తరబడి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వర్షపు నీరు పూర్తిగా స్తంభించడంతో అంటు వ్యాధులు ప్రబలుతాయోమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళన చెందుతున్న రైతులు

ఎడతేరిపి లేని భారీ వర్షానికి మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, కొల్లిపర, దావులూరిపాలెం, తూములూరు తదితర గ్రామాల్లో మెట్ట భూముల్లో వేసిన పంటలు నీటిలో తేలియాడుతున్నాయి. పసుపు, అరటి, కంద, జామ, కూరగాయల తోటల్లోకి వర్షపు నీరు చేరటంతో ఎక్కడ దెబ్బతింటాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటపొలాలు ముంపుకు గురయ్యాయి.

కృష్ణానదికి పెరిగిన వరద ఉధృతి

● లంకగ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ

కొల్లిపర, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరద నీరు తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరగటంతో మండల అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రకా శం బ్యారేజి నుంచి 92,931 క్యూసెక్కుల పైగా నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేయడంతో శనివారం తహసీల్దార్ సిద్ధార్థ వీఆర్వోలను అప్రమత్తం చేశారు. వరద ఉధృతి తగ్గే వరకు కృష్ణానది రేవుల్లో ప్రతి ఒక్క వీఆర్వో డ్యూటీ చేయాలని ఆదేశించారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల ప్రజలు, పడవలు నడిపే జాలర్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చేపల వేటకు కృష్ణా నదిలోకి ఎవరూ వెళ్లొద్దని అధికారులు గ్రామాల్లో సూచించారు.

ఎడతెరిపి లేని వర్షం..

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం పొన్నూరు మండలంలో కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై.. మధ్యాహ్నం ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. పొన్నూరు పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రధాన రహదారులపైకి భారీగా వర్షపు నీరు చేరింది. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారిపై నిలిచి ఉండడంతో వాన నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ప్రజలకు ఏర్పడింది. మండల పరిధిలోని మాచవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు చేరడంతో.. పాదచారులు, వాహనదారులు వాన నీటిలోనే రాకపోకలు సాగించారు. కసుకర్రు గ్రామంలో గతంలోనే కురిసిన వర్షాలకు ప్రధాన రహదారి తీవ్రంగా ధ్వంసమైంది. ఇప్పుడు ఆ భారీ గుంతల్లోకి వర్షపు నీరు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విష జ్వరాల ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామాల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కొల్లిపర: తూములూరు ఎస్సీ కాలనీ పాఠశాలలో వర్షపు నీరు



కొల్లిపరలో లంక గ్రామాల నుంచి పడవల ద్వారా వస్తున్న రైతులు



పొన్నూరు: మాచవరంలో రహదారి జలమయం



పొన్నూరు: కసుకర్రులో రహదారిపైకి చేరిన వర్షపు నీరు



వడ్లమూడి అడ్డరోడ్డులో మోకాలి లోతు గుంతలు

గుంతలు..తిప్పలు

చేబ్రోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లమూడి అడ్డరోడ్డు లో గుంటూరు-తెనాలి ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులకు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. గుంతలను పూడ్చాలని వారు కోరుతున్నారు.

60 కేసులు పరిష్కారం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 60 కేసులు పరిష్కరించారు. మండల న్యాయ సేవా కేంద్రం చైర్మన్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో 6 సివిల్, 4 మనోవర్తి, 3 చెక్ బౌన్స్, 9 ఎక్సైజ్. 37 క్రిమినల్, 1 ప్రీ లిటిల్ తదితర రూ. 78.98 లక్షలకు సంబంధించిన కేసులను పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్, లోక్ అదాలత్ మెంబర్ మగ్బుల్ బేగ్, న్యాయవాదులు ఎం.వీరేష్, స్టాడింగ్ కౌన్సిల్ న్యాయవాది తూమాటి రమేష్, నక్కా కృష్ణ పాల్గొన్నారు.



కేసులు విచారిస్తున్న మెజిస్ట్రేట్ పవన్ కుమార్

బాల్యం నుంచే ఆత్రేయ నాటిక ప్రదర్శనలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే కవి ఆత్రేయ నాటిక ప్రదర్శనల్లో పాల్గొన్నారని సాహిత్యవేత్త యర్రంశెట్టి హనుమంతరావు చెప్పారు. గాంధీ నగర్‌లోని ఇప్కఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్న కళాకారుల సంస్మరణ సభల్లో భాగంగా శనివారం ఆత్రేయ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈనాడు, పరివర్తన, విశ్వశాంతి వంటి పలు నాటికలు రచించారని, స్వాతంత్ర్యోద్యమం లో కూడా పాల్గొన్నారని చెప్పారు. ఆయన రాసిన సినీ సంభాషణలు ప్రజల్లో చైతన్యం తెచ్చాయని, 200 చిత్రాలకు సంభాషణలు, 2 వేల పాటలు రాశారని చెప్పారు. బాలస్వామి, వరలక్ష్మి, శ్రీదేవి, నాగమణి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న హనుమంతరావు

లోక్ అదాలత్‌లో 714 కేసుల పరిష్కారం

తెనాలి క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెనాలి కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన లోక్ అదాలత్ రాత్రి 9 గంటలకు కొనసాగింది. ఈ లోక్ అదాలత్‌లో అత్యధికంగా 714 కేసులు పరిష్కరించినట్లు 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు తెలిపారు. ఇందులో క్రిమినల్ కేసులు 656, సివిల్ కేసులు 56, ప్రీ లిటిగేషన్ కేసులు 2 పరిష్కరించడం జరిగిందన్నారు. మొత్తం నాలుగు బెంచీలు ఏర్పాటు జరిగిందన్నారు. రూ.5.57 కోట్ల మేర బాధితులకు ఇప్పించడం జరిగిందన్నారు. న్యాయమూర్తులు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ హరీఫ్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, లోక్ అదాలత్ మెంబర్లుగా గువ్వల పద్మావతి, బి.రాజ్యలక్ష్మి, ప్రభావతి, షేక్ అమీర్‌జాన్‌లు వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



కేసులు పరిశీలిస్తున్న న్యాయాధికారి శ్రీనివాసులు

రహదారుల ముంపు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జోరు వర్షంతో కొలకలూరు బీసీ కాలనీలో రహదారులు జలమయం అయ్యాయి. మురుగు కాల్వలు లేకపోవడంతో పాటు లోతట్టు కావడంతో నీరంతా అక్కడ చేరింది. డ్రెయినేజీ కోసం ప్రధాన రహదారులను తవ్వడంతో సమస్య జఠిలమైంది. కాల్వల్లో మురుగు నీరు ఇంకిపోయేలా ప్రధాన రహదారుల వెంబడి కాల్వలు నిర్మించే పని చేపట్టారు. ఈ పనులు పూర్తి కాకపోవడంతో రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. త్వరితగతిన కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నీటి మడుగులా కొలకలూరు బీసీ కాలనీ రోడ్డు